క్లుప్తంగా

235 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ హాస్పిటల్ తిరుపతి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 235 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్టు ఎండీ చాగణంగౌరీశంకర్, సీఈఓ సీతారామ్‌నాయుడు తెలిపారు. ఇందులో 60 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 45 మందికి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయంలో ఉచితంగా కంటికి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. భోజనం, రవాణా, మందులను ఉచితంగా అందజేస్తామని ఏఓ గల్లాకృష్ణ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు వినతులను అందజేస్తున్న స్థానికులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కారణి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వేసిన సిమెంటు రహదారులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. రూ.35 లక్షలతో అయిదు వీధుల్లో వేసిన రోడ్లను ఆయన ప్రారంభించారు. గ్రామంలోని పలు సమస్యలను గ్రామస్తులు ఏకరువు పెట్టారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, తహసీల్దారు శ్రీదేవి, సర్పంచ్ పద్మమ్మ, కార్తీక్, రవినాయుడు, మునిచంద్రనాయుడు, ఏఓ భారతి, అధికారులు పాల్గొన్నారు.

వైద్య నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశిష్ట అతిథులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : మాస్టరింగ్ సెప్సిస్ నిర్వహణ, యాంటీబయాటిక్ థెరపీపై అమరా హాస్పిటల్‌లో మంగళవారం మెడికల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, డాక్టర్ గౌరినేని రమాదేవి ఆహ్వానం మేరకు వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఆరోగ్య సంరక్షణలో నిరంతర విద్య, వైద్యం ప్రాముఖ్యం వివరించారు.

క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండల మల్లిగుంట సర్కిల్ వద్ద ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన ట్రావెల్ బస్సు బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులను అమర హాస్పిటల్ తక్షణం స్పందించి మెరుగైన, అత్యాధునిక వైద్య సేవలు అందించినట్లు అమరా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని కరకంబాడి సమీపంలోని అమర హాస్పిటల్ కు తరలించారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ రెడ్డి నేతృత్వంలోని అత్యవసర విభాగం బృందం వెంటనే స్పందించి తక్షణ వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు.

సచివాలయాలకు 'చంద్ర'గ్రహణం

సచివాలయాల్లో వైఎస్సార్‌సీపీ హయాంలో 536కు పైగా సేవలు అందించేవారు.. గడప దాటకుండానే సేవలు పొందేవారు..కానీ నేడు సచివాలయాల్లో వంద సేవలు కూడా అందడం లేదు. ఫలితంగా ఏ చిన్న పనికైనా మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజలు మండల కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు దాపురించాయి. సమయం వృథాతో పాటు ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇందిరానగర్‌లో ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

- సేవలను తగ్గించిన కూటమి సర్కారు
- మళ్లీ మండల కేంద్రాలకు పరుగో.. పరుగు
- పూర్తి స్థాయిలో అందని సేవలు
- ఇబ్బందులు పడుతున్న జనం



వరదయ్యపాళెం : సీఎల్ఎన్‌పల్లి సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సత్యవేడు నియోజకవర్గంలోని సచివాలయాల వివరాలు	
మండలం	గ్రామ సచివాలయాల సంఖ్య
వరదయ్యపాళెం	11
సత్యవేడు	17
బీఎన్‌కండ్రిగ	11
కేవీబీపురం	19
నారాయణవనం	11
పిచ్చాటూరు	10
నాగలాపురం	11

వరదయ్యపాళెం : గ్రామీణులు గతంలో ఏ చిన్న పని ఉన్నా వేకువజామునే లేచి మండల కేంద్రం, జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధపడాల్సి వచ్చేది. దీంతో ఉదయం చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా ఆ సమస్యపై రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవి కావు. ఈ విషయాన్ని గ్రహించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయిలోనే అందించేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి 2 వేల కుటుంబాలకు ఓ సచివాలయం ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి సచివాలయంలో పది మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రైతులు, గ్రామీణుల సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు 536 రకాల సేవలను అందించేవారు. ప్రతిరోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలాగే రైతులు, గ్రామీణులకు అవసరమైన ధ్రువపత్రాలు సచివాలయాల ద్వారా పొందేవారు. ఇక సంక్షేమ పథకాలు అందించడంలోనూ ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

నిర్లక్ష్యం చూపడంతో..



వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న అర్జీదారులు

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సేవలకు పేరొందిన సచివాలయాలు 2024 ఎన్నికల అనంతరం చంద్రబాబు సీఎం అయ్యాక నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రభుత్వం ఏర్పడగానే సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న వాలంటీర్ వ్యవస్థను ఉనికిలో లేకుండా చేశారు. అలాగే వాలంటీర్ల విధులను సచివాలయ సిబ్బందికి కేటాయించడంతో వారు కార్యాలయం కంటే గ్రామాల్లోనే వివిధ పనుల నిమిత్తం తిరుగుతుండటంతో సేవలు అందక ప్రజలు మండల కేంద్రాల్లోని కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు.

సేవలు కొనసాగించాలి



ప్రతి పంచాయతీలో సచివాలయాలు ఉండడం వల్ల రైతులు ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సచివాలయ సిబ్బంది సరిగా సచివాలయాలకు రాకపోవడంతో ఎన్నో ప్రయాసలు పడి మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది. మళ్లీ 2019 నాటి పూర్వపు పరిస్థితులు నెలకొంటున్నాయి. పనులు మానుకొని మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం.

– సిద్దిక్, వరదయ్యపాళెం

వ్యవస్థలను నిర్వీర్యం చేయొద్దు



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ సచివాలయాల్లో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. గ్రామంలోనే అన్ని సేవలు అందుతుండటంతో అయిదేళ్ల పాటు ప్రజాదరణ పొందాయి. వాటి ద్వారా ప్రజలకు మంచి జరుగుతున్నప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం తగదు. అలాగే వాలంటీర్ వ్యవస్థను కొనసాగించి నిరుద్యోగులకు ఉపాధి చూపాలి. దీని ద్వారా లక్షల మంది నిరుద్యోగులకు ఊర్లోనే ఉద్యోగం కల్పించనట్లువుతుంది. ప్రజలకు ఇంటి వద్దకే సేవలందుతాయి.

– వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ, వరదయ్యపాళెం మండలం

గంగమ్మ ఆలయంలో పూజలు



గంగమ్మ దేవతను దర్శించుకున్న రాజేష్, నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కంచనపుత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో అమ్మవారిని మంగళవారం సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు మణినాయుడు, సోషల్ మీడియా కన్వీనరు వేలూరురాకేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్రవర్మ, జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



హోమ పూజల్లో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామంలో మంగళవారం గ్రామ దేవత శీతలాంబ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. కార్యక్రమంలో అంజూరు రాజశేఖర్, అంజూరు రఘురామయ్య, వసంతయ్య, అంజూరు కృష్ణ, కనపర్తి పాపయ్య, కనపర్తి చలపతి, మైనంపాటి దయాకర్, ప్రసాద్, అంకయ్య పాల్గొన్నారు.

మా ఊరి బడిని విలీనం చేయొద్దు



వరదయ్యపాళెం ఎమ్మార్పీ కార్యాలయం వద్ద ధర్నాలో ఎంజీనగర్ గిరిజనులు



ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపార్లపల్లి, కృష్ణాపురం కాలనీ వాసులు

వరదయ్యపాళెం : మండలంలోని ఎంజీనగర్ గిరిజన కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అంబికాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. మంగళవారం ఎంజీనగర్ గిరిజన కాలనీకి చెందిన గిరిజనులు వరదయ్యపాళెం ఎమ్మార్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విలీన నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ నిరసనకు మద్దతు ప్రకటించారు. ఎంజీనగర్ నుంచి అంబికాపురం వెళ్లాలంటే సుమారు 2కి.మీల దూరం ఉందని, అంత దూరం 3, 4, 5 తరగతులకు చెందిన చిన్న పిల్లలు ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సరస్వతికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, పాఠశాల కమిటీ చైర్మన్ మణి తదితరులు ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలగా మార్చొద్దు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాటూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్చొద్దని మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో 115 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 6,7,8 తరగతుల్లో 50 మంది విద్యార్థులున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న యూపీ స్కూల్‌ను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్చటం వలన 6,7,8, తరగతుల విద్యార్థులు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. యూపీ స్కూల్‌ను ప్రైమరీ స్కూల్‌గా మార్చితే ఊరుకోమని, పాఠశాలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. ప్రైమరీ స్కూల్ వద్దని తీర్మానం చేసినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు.

విలీనంపై ఏపార్లపల్లి, కృష్ణాపురం ప్రజల నిరసన

పీవీకండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏపార్లపల్లి, కృష్ణాపురం గిరిజన కాలనీలోని ప్రైమరీ పాఠశాలను రద్దు చేయొద్దని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యంకు వినతి పత్రం ఇచ్చి, ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏపార్లపల్లి, కృష్ణాపురం గిరిజన కాలనీలోని ప్రైమరీ పాఠశాలను రద్దు చేసి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీవీ కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.

వెస్టువరత్తూరులో త్రిపుర గవర్నర్



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న సురేంద్రకుమార్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి మంగళవారం వెస్టువరత్తూరు గ్రామంలోని తన వియ్యంకుడు ఇంటికి వచ్చారు. తిరుమల పర్యటన నిమిత్తం జిల్లాకు వచ్చిన ఆయన వెస్టువరత్తూరు గ్రామంలో వియ్యంకుడు ఇంటికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం, గ్రామస్తులు, మండల నాయకులతో కలివిడిగా మాట్లాడారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు బందోబస్తు చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం తహసీల్దార్ భార్గవి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు వేసవి దృష్ట్యా తాగునీటిని అందించాలనే లక్ష్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఐ సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన



ఏర్పేడు : పెన్నగడ్డంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో అంగన్‌వాడీలు , గర్భిణులు, చిన్నారులు

ఏర్పేడు(రేణిగుంట) : ప్రతిరోజూ గుడ్డు తినడం బలవర్ధకమని ఏర్పేడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శోభారాణి అన్నారు. ఏర్పేడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం జరిగింది. పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యతకను గురించి తెలియజేసి, అంగన్‌వాడీ కేంద్రాలలో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మండలంలోని రావిళ్లవారి కండ్రిగ, పెన్నగడ్డం, చెన్నంపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అన్నపూర్ణ, సరస్వతీ, అంకమ్మ, రేవతి, శారద పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్ఎల్ఓ అరుణ్‌కుమార్

సత్యవేడు : మండల పరిధిలో దాసుకుప్పం, నరసరాజు అగ్రహారం పంచాయతీలో నిర్వహిస్తున్న రీసర్వేలకు రెండు పంచాయతీ ప్రజలు సహకరించాలని జిల్లా సర్వేయర్, భూరికార్డుల అధికారి అరుణ్‌కుమార్ కోరారు. మంగళవారం రెండు పంచాయతీల్లో రీసర్వేలపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమి, పట్టా , డీకేటీ భూములు సమగ్రంగా సర్వేచేసి భూవిస్తీర్ణం వివరాలు సమగ్రంగా తెలియజేస్తారని తెలిపారు. దాసుకుప్పం పరిధిలో 260.54 ఎకరాలు, నరసరాజు అగ్రహారంలో 176.40 ఎకరాలు రీసర్వే చేపడుతారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజశేఖర్, సర్పంచులు రవిరెడ్డి, బాలాజీ, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుందరరామిరెడ్డి, లోకయ్య రెడ్డి, మండల సర్వేయర్ చంద్రశేఖర్ , సర్వేయర్ గిరి, ఆర్ఐ సురేష్, గ్రామ రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

శ్రీకాళహస్తి : పదోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు ఉమ్మడి తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి బి.రామమోహన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ.. అర్హులైన గ్రామ రెవెన్యూ సహాయకులకు ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్ పోస్టులకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. వీఆర్ఏ నాయకులు లక్ష్మణ్, సాంబయ్య, అంకయ్య, నాగరాజు, బాబు పాల్గొన్నారు.

పుడమితల్లి పరిరక్షణతో భవిష్యత్తుకు భరోసా



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చంద్రశేఖర్

రేణిగుంట : పుడమితల్లిని పరిరక్షించడం అందరి బాధ్యతని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఎర్రమరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం సందర్భంగా అవగాహన, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని కోరారు. విరివిగా మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధానోపాధ్యాయురాలు పూజిత, సీఆర్పీ ధన శేఖర్, తులసీరాం పాల్గొన్నారు.

పనులు అడ్డదిడ్డం.. ట్రాఫిక్ అస్తవ్యస్తం

- అండర్ డ్రైనేజ్ పనులతో అవస్థలు
- తప్పని ట్రాఫిక్ కష్టాలు
- తాత్కాలిక పనులతో ఇబ్బందులు
- శాశ్వత పరిష్కారం చూపని వైనం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుపతి–రేణిగుంట ప్రధాన రహదారి కింద ఉన్న అండర్ డ్రైనేజ్ పనులు అస్తవ్యస్తంగా మారాయి. డ్రైనేజ్ పైకప్పు నిత్యం ఏదో ఒకచోట డామేజ్ అవుతుండటంతో రేణిగుంట–తిరుపతి రహదారిలో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. తాత్కాలిక పనులు చేస్తూ ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.



పనులతో రోడ్డుకు అడ్డంగా పెట్టిన సూచిక బోర్డులు



మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

రోడ్డపైనే మట్టివేయడం

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే తిరుపతి–రేణిగుంట ప్రధాన రహదారి కింది భాగంలో అండర్ డ్రైనేజ్ ఉంది. తిరుపతి నుంచి రేణిగుంటకు వచ్చే వైపు డ్రైనేజ్ నిత్యం ఏదో ఒక చోట పగిలిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక చోట తాత్కాలిక పనులు చేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిలో వాహనాలను ఒకే వైపు మళ్లించడంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. అండర్ డ్రైనేజ్ పై కప్పు పనులు చేసి రోడ్డుపైనే మట్టి వదిలేయడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము విపరీతంగా వ్యాపించి ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారికి తీవ్ర సమస్యగా మారింది.



మరమ్మతు పనులు చేస్తుండడంతో ఏర్పడిన దుమ్ములో వాహనాల రాకపోకలు

రోడ్డు గుంతలమయం



అండర్ డ్రైనేజ్ పైకప్పు పనులు చేసిన మూడు నెలలకు మళ్లీ పడిన గుంత

అండర్ డ్రైనేజ్ పైకప్పు పగిలిపోవడంతో రహదారిలో అక్కడక్కడా గుంతలు ఏర్పడి ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు గుంతల్లో పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు నిత్యం అండర్ డ్రైనేజ్ పైకప్పు పగిలిపోయిన చోట తాత్కాలిక పనులు చేస్తున్నారు. కానీ మరమ్మతు పనులు చేసిన చోటే రెండు మూడు నెలలకు మళ్లీ గుంతలు ఏర్పడటం అధికారుల నిర్లక్ష్యానికి పనులు నిదర్శంగా మారుతున్నాయి.

ఇబ్బందులు పడుతున్నాం



తిరుపతికి వెళ్లి రావాలంటే ట్రాఫిక్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట రోడ్డుపైన మరమ్మతు పనులు చేస్తూనే ఉంటున్నారు. అండర్ డ్రైనేజీ పై కప్పునకు శాశ్వత పరిష్కారం చూపాలి. గుంతల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో త్వరగా వెళ్లాలంటే ట్రాఫిక్‌తో సమయానికి వెళ్లలేకపోతున్నాం. సమస్యను ఉన్నతాధికారులు పరిష్కరించాలి.

– గోపి, వాహన చోదకుడు, రేణిగుంట